క్లుప్తంగా

నవోదయకు విద్యార్థి ఎంపిక



సిరికొండ: నిజాంసాగర్‌లో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయానికి సిరికొండ సత్యశోధక్ పాఠశాలకు చెందిన విద్యార్థి కె అభివర్ధన్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఆర్ నర్సయ్య తెలిపారు. రెండో విడత విడుదలైన ఫలితాల్లో అభివర్ధన్ నవోదయ ఆరో తరగతికి ఎంపికయ్యాడు. విద్యార్థినిని ప్రిన్సిపాల్ పాఠశాలలో మంగళవారం సన్మానించారు. మమత శ్రీనివాస్, రాజన్న, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్ దిష్టిబొమ్మ దహనం



సిరికొండ: మండల కేంద్రంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మను సీపీఐఎంఎల్ మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం దహనం చేశారు. దేశాల మధ్య చిచ్చు పెడుతు అమెరికా అధ్యక్షుడు యుద్ధాలను చేసేలా ప్రేరేపిస్తున్నారని వారు ఆరోపించారు. ఇరాన్‌పై ఇజ్రాయిల్‌తో కలిసి అమెరికా చేస్తున్న పరోక్ష యుద్ధాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ సహాయ కార్యదర్శి రమేష్, దామోదర్, కిశోర్, భూమాగౌడ్, బాల్‌రెడ్డి, ఎర్రన్న, గంగమల్లు తదితరులు పాల్గొన్నారు.

వానరానికి అంత్యక్రియలు



నిజామాబాద్ రూరల్: నగరంలోని కంఠేశ్వర్ కమాన్ వద్ద గుర్తు తెలియని వాహనం మంగళవారం ఢీకొని మృతి చెందింది. వానర కళేబరాన్ని విశ్వహిందు పరిషత్ సహకార్యదర్శి ధాత్రిక రమేశ్ భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ సభ్యులతో కలిసి దుబ్బ ప్రాంతంలో అంత్యక్రియలు చేశారు. ఇప్పటి వరకు 30 వరకు వానరులకు, 15 గోవులకు అంత్యక్రియలు చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నగర కార్యదర్శి రాంప్రసాద్ చటర్జీ, ఇందూరు సురేశ్, ప్రణదీప్ పాల్గొన్నారు.

రాష్ట్ర క్రీడల చైర్మన్‌ను కలిసిన నాయకులు



నిజామాబాద్ నాగారం: జిల్లా కేంద్రంలో నూతన స్టేడియాన్ని త్వరగా నిర్మించేలా చూడాలని రాష్ట్ర క్రీడల చైర్మన్ శివసేనరెడ్డిని జాతీయ గోల్డ్ మెడలిస్ట్ సయ్యద్ కైసర్ ఆధ్వర్యంలో మంగళవారం విన్నవించారు. స్టేడియం నిర్మాణం సంబంధించి ఇదివరకే జిల్లాకు వచ్చి పరిశీలన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. నిధులు విడుదల చేయించాలని కోరారు. అలాగే సీఎం టోర్నమెంట్లో, ఇతర క్రీడలకు సంబంధించి జాతీయస్థాయిలో బంగారు, రజత పతకాలు సాధించిన క్రీడాకారులకు నగదు పురస్కారాన్ని అందించాలన్నారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి



రెంజల్: భూభారతిలో భాగంగా గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్‌మహతో సూచించారు. మంగళవారం రెంజల్ తహసీల్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల నమోదును పరిశీలించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల్లో పరిష్కారమైన వాటిని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగు చేయాలి



మోర్తాడ్: ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహం అందిస్తున్న దృష్ట్యా ఈ రకం పంటను సాగు చేయాలని ఉద్యానవన శాఖ అధికారి రోహిత్ సూచించారు. మంగళవారం భీమ్‌గల్ మండలం గోనుగొప్పులలో ఆయన రైతు చెరుకుపల్లి విజయేందర్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. అధికారులు, సిబ్బంది ఉన్నారు.



మోపాల్‌లో వీసీలో పాల్గొన్న అంతిరెడ్డి రాజారెడ్డి, అధికారులు



వీసీలో పాల్గొన్న రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్



సిరికొండలో సంబురాల్లో పాల్గొన్న నాయకులు

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి

- తొమ్మిది రోజుల్లో రూ. తొమ్మిది వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ
- అభివృద్ధి ఇందిరమ్మ రాజ్యంతోనే సాధ్యం
- రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి
- రైతు వేదికల్లో ఘనంగా రైతు భరోసా విజయోత్సవాలు



ఇందల్వాయిలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, నాయకులు



ఇందల్వాయిలో వీసీలో పాల్గొన్న ఎమ్మెల్యే

ఇందల్వాయి/ మోపాల్/ నిజామాబాద్‌రూరల్/ సిరికొండ: వానాకాలం పంటల సాగు కోసం రైతు భరోసా నగదు బదిలీ విజయవంతంగా పూర్తయిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం 'రైతు పండుగ' పేరిట రైతు భరోసా విజయోత్సవాలను మంగళవారం చేపట్టింది. ప్రభుత్వం రైతు భరోసా పథకంలో భాగంగా రికార్డు స్థాయిలో తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్ల పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసి వారికి అండగా నిలిచిందని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. ఇందల్వాయి రైతువేదికలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు రైతులను భాగస్వాములు చేయడంతో సీఎం ప్రసంగాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని అన్నారు. తెలంగాణలో వ్యవసాయం దండుగ కాదు పండుగ చేయాలన్న ఆలోచన మేరకు ఇందిరమ్మ రాజ్యంలో సోనియమ్మ నాయకత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో రైతునేస్తం పథకాన్ని రైతుల ఖాతాల్లో రికార్డు స్థాయిలో 9 రోజుల్లో పెట్టుబడి సాయంగా దాదాపు రూ.9 వేల కోట్లను భరోసా కింద నిధులు విడుదల చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని మండల కేంద్రాల్లో ఉన్న రైతువేదికల ద్వారా 'రైతు నేస్తం' కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోత్కూరి నవీన్, అమృతపూర్ గంగాధర్, పీఏసీఎస్ చైర్మన్ చింతలపల్లి గోపి, నాయకులు వాసుబాబు, శ్యామ్ సన్, ముత్తన్న, కడారి, వీరయ్య, కేపీ గంగారాం, ఎంపీడీవో అనంతరావు, తహసీల్దార్, వెంకట్రావు, ఏవో శ్రీకాంత్, ప్రకాశ్‌గౌడ్, భరత్, రైతులు, పాల్గొన్నారు.

మోపాల్ మండలంలోని మోపాల్, కంజర, మంచిప్ప క్లస్టర్ రైతువేదికల్లో రైతు భరోసా విజయోత్సవాలను ఘనంగా నిర్వహించారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు రైతులను భాగస్వాములు చేయడంతో సీఎం ప్రసంగాన్ని వీక్షించారు. ఈసందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఏడాదికి ఎకరానికి రూ.12వేలు రైతు భరోసా నిధులను జమ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌డీసీసీబీ వైస్ చైర్మన్ నల్ల చంద్రశేఖర్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి గోవింద్‌రావు, డీఈవో అశోక్, ఏవో సౌమ్య, కాంగ్రెస్ మండలఅధ్యక్షుడు ఎల్లోల్ల సాయిరెడ్డి, నాయకులు రాములు, తిరుపతి, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

రూరల్ మండలంలోని గుండారం రైతువేదికలో తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైతులకు ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఎకరాకు రూ.ఆరు వేలు రైతు భరోసా కింద వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం గొప్ప విషయమని అన్నారు. అడిషనల్ కలెక్టర్ కిరణ్, ఆర్డీవో రాజేంద్ర కుమార్, మండల వ్యవసాయాధికారి హీరా జాదవ్, గుండారం సింగిల్ విండో చైర్మన్ దాసరి శ్రీధర్, రైతులు పాల్గొన్నారు. సిరికొండ మండల కేంద్రంలో రైతు భరోసా నిధులు పెద్ద మొత్తంలో విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పటాకులు కాల్చి సంబురాలు చేపట్టారు. పార్టీ మండలాధ్యక్షుడు బాకారం రవి, డీసీసీ కార్యదర్శులు ఎర్రన్న, చందర్‌నాయక్, రాజేందర్‌గౌడ్, కుందేళ్ల శ్రీనివాస్, మోజీరాం, శివాజీనాయక్, రవినాయక్, సంతోష్‌నాయక్, దిగంబర్, జెన్ను శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ పేరుతో మొక్క నాటాలి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



దుబ్బలో మహిళలకు మొక్కలు పంపిణీ చేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ..

సుభాష్‌నగర్: బలిదాన్ దివస్ కార్యక్రమంలో భాగంగా పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ అమ్మ పేరు మీద మొక్కను నాటాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పిలుపునిచ్చారు. బీజేపీ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామప్రకాశ్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా నగరంలోని దుబ్బ చౌరస్తాలో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. శ్యామప్రసాద్ ముఖర్జీ దేశ సమగ్రత, ఐక్యత కోసం హిందువుల్లో భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను పెంపొందించడం ద్వారా జాతీయ పునర్నిర్మాణం జరుగుతుందనే లక్ష్యంతో బీజేఎస్‌ను(భారతీయ జన సంఘ్) స్థాపించారని గుర్తుచేశారు. జాతి ఐక్యతను ముప్పుగా భావించే ఆర్టికల్ 370ని ముఖర్జీ తీవ్రంగా వ్యతిరేకించారని అన్నారు. ఏక్ దేశ్ మే దో విధాన్, దో ప్రధాన్, ఔర్ దో నిషాన్ నహి ఛాలెంగే (ఒకే దేశానికి రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానులు, రెండు జాతీయ చిహ్నాలు ఉండకూడదు) అని స్పష్టం చేశారన్నారు. ముఖర్జీ ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా ఆర్టికల్ 370ని రద్దు చేసి కశ్మీర్‌ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. ఆయన మరణం నేటికీ అంతు చిక్కకుండా ఉందని, అందుకే ఆ మహనీయుని త్యాగానికి గుర్తుగా బలిదాన్ దివస్‌ను జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. అనంతరం మహిళలకు ఎమ్మెల్యే మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ గోపిడి స్రవంతిరెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు పంచరెడ్డి ప్రవళిక, నాయకులు గడ్డం రాజు, మాస్టర్ శంకర్, పంచరెడ్డి శ్రీధర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దేశ సమగ్ర అభివృద్ధే మోదీ లక్ష్యం

- బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మాదాను స్వామి యాదవ్



కరపత్రాలను పంపిణీ చేస్తున్న స్వామియాదవ్

నిజామాబాద్ రూరల్ : దేశ సమగ్ర అభివృద్ధే ప్రధాని మోదీ లక్ష్యమని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మాదాసు స్వామి యాదవ్ అన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు రూరల్ మండలం మల్లారంలో ప్రజలతో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రజలకు వివరించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాలతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించి గ్రామస్తులకు పంచిపెట్టారు. కేంద్ర పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ చికోటి రవి, సొసైటీ డైరెక్టర్ గోపి, బొల్లం గంగాధర్, దశరథ్, మోహన్, గంగాధర్, రాజ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం..

నూతన కార్యవర్గం ఎన్నిక

సిరికొండ: సిరికొండ మండల ఆలిండియా బంజారా సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. అధ్యక్షుడిగా బాదావత్ రూప్‌సింగ్, ప్రధాన కార్యదర్శిగా మాలావత్ రవి, ఉపాధ్యక్షులుగా బాలరాజు, బద్యనాయక్, కార్యదర్శిగా రమేశ్, కార్యవర్గ సభ్యుడిగా గణేశ్ ఎన్నికయ్యారు. వారికి జిల్లా నాయకుడు బాలరాజ్‌నాయక్ నియామక పత్రాలను అందజేశారు. అనంతరం సేవాలాల్ మహరాజ్, జగదాంబ మాతకు పూజలు చేశారు. శివాజీ నాయక్, సంతోష్‌నాయక్, చందర్‌నాయక్, బన్నాజీ, బలరాం, మోజీరాం, గజన్‌లాల్, రవినాయక్, లాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా కార్యవర్గ సభ్యులు

మొక్కల సంరక్షణ చర్యలు పక్కాగా చేపట్టాలి



నడిపల్లి నర్సరీలో మొక్కల వివరాలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

డిచ్‌పల్లి: వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కల సంరక్షణ చర్యలు పక్కాగా చేపట్టాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. డిచ్‌పల్లి మండలం నడిపల్లిలో నిర్వహిస్తున్న సెంట్రల్ నర్సరీని కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. మొక్కల పెంపకం తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అవెన్యూ ప్లాంటేషన్ కోసం మూడు మీటర్ల వరకు ఎత్తు కలిగిన మొక్కలను అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. నర్సరీల నిర్వహణ, మొక్కల సంరక్షణలో ఉపాధి హామీ కూలీలను, గ్రామ పంచాయతీలను భాగస్వాములు చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఈసారి 51.49 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నందున, ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. నర్సరీలలో మొలకెత్తని విత్తనాల స్థానంలో ఇతర మొక్కలు పెంచాలన్నారు. ఎంపీడీవో బుక్య లింగం, తహసీల్దార్ సతీష్‌రెడ్డి, ఏపీవో మంజుల, పంచాయతీ కార్యదర్శి రాధిక, జూనియర్ అసిస్టెంట్ రజత్, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్లకు ఎలక్ట్రిసిటీ జేఏసీ శుభాకాంక్షలు

సుభాష్‌నగర్: టీజీఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్లుగా నియమితులైన ప్రభాకర్ (హెచ్‌ఆర్‌డీసీ), మధుసూదన్(ఆపరేషన్స్), వి మోహన్‌రావు (ప్రాజెక్ట్స్), తిరుమలరెడ్డి(ఫైనాన్స్)లకు నిజామాబాద్ జిల్లా ఎలక్ట్రిసిటీ జేఏసీ నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ఎన్‌పీడీసీఎల్ అభివృద్ధికి నిజాయితీగా, నిబద్ధతతో పని చేసే అధికారులను డైరెక్టర్లుగా నియమించిందుకు, బడుగు, బలహీనవర్గాలకు ప్రాతినిధ్యం కల్పించినందుకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం, విద్యుత్‌శాఖ మంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు నాయకులు ధన్యవాదాలు తెలిపారు. జేఏసీ చైర్మన్ రఘునందన్, కన్వీనర్ శ్రీనివాస్, కో కన్వీనర్ తోట రాజశేఖర్, కోశాధికారి సురేశ్‌కుమార్, నాయకులు మల్లేశ్, బాలేశ్ కుమార్, కాశీనాథ్, రాజేందర్‌రెడ్డి, గంగారాం నాయక్, నాంపల్లి, మన్మోహన్, శ్యామ్, శ్రీనివాస్, జాకీర్, రమణ, రాజేందర్‌గౌడ్, రాజేందర్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే సుభిక్ష పాలన

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్ రూరల్ : కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉన్నారని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. నగరంలోని రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సిరికొండ, ధర్పల్లి, ఇందల్వాయి, డిచ్‌పల్లి, మోపాల్, నిజామాబాద్ రూరల్ మండలాలకు చెందిన 281 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాకుండా ప్రభుత్వం ఇవ్వని హామీలను సైతం అమలు చేస్తోందని అన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో తెలంగాణను అప్పుల పాలు చేసిందన్నారు. ప్రజలు బీఆర్‌ఎస్, బీజేపీలను నమ్మే పరిస్థితిలో లేరని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ ప్రారంభమైందని అర్హులకు అందిస్తామని పేర్కొన్నారు. నూతన రేషన్‌కార్డులు జారీ చేసే ప్రక్రియ కొనసాగుతందని అన్నారు. అనంతరం డిచ్‌పల్లి మండలం ఆరెపల్లికి గ్రామస్తులు గ్రామానికి చెందిన రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ అధ్యక్షుడు బాడ్సి శేఖర్ గౌడ్, పార్టీ ఆరు మండలాల అధ్యక్షులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత



నిజామాబాద్ సిటీ: కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నట్లు కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని బల్దియా కార్యాలయంలో మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వై ఓమయ్య, టీయూసీఐ జిల్లా కార్యదర్శి ఎం సుధాకర్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎ రమేశ్ బాబు మున్సిపల్ మేనేజర్ జనార్దన్‌కు సార్వత్రిక సమ్మె నోటీసును అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, కనీస వేతనాల అమలు కోసం జాతీయ కార్మిక సంఘాలు జూలై 9న సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. నాయకులు పి హన్మాండ్లు, రాధాకుమార్, భానుచందర్, డి కిరణ్, ఎన్ రవికుమార్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలు సరఫరా చేయాలి

నిజామాబాద్ సిటీ : రైతులకు ఎరువులు, విత్తనాలు సకాలంలో సరిపడా అందించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని నాందేవ్‌వాడలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పెద్ది వెంకట్రాములు మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభమైనా రైతులకు కావాల్సిన విత్తనాలు సరఫరా చేయడం లేదన్నారు. ఇదే అదునుగా ప్రైవేట్ వ్యాపారులు నకిలీ విత్తనాలు సరఫరా చేస్తూ రైతులను మోసం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు రమేశ్ బాబు, నూర్జహాన్, నాగేశ్వరరావు, సుజాత, విఘ్నేష్ పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	98,900	వెండి(కిలో)	1,10,000
22 క్యారెట్స్	91,297		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	160
		లైవ్	120
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	16	30	క్యాప్సికం	50	90
బెండకాయ	30	50	గాజరుగడ్డ	30	60
బీరకాయ	50	70	పచ్చిమిర్చి	50	80
దొండకాయ	20	40	దోసకాయ	20	40
బీర్నీసుకాయ	100	150	ఆలుగడ్డ	30	50
కాకరకాయ	30	50	గోబిగడ్డ	10	20
వంకాయ	30	60	గోబిపువ్వు	40	60
పాలకూర	80	120	బీట్‌రూట్	30	60
మెంతికూర	60	100	కరివేపాకు	40	60
కొత్తిమీర	30	50	చామగడ్డ	30	50
పుదీనా	60	90	చిక్కుడుకాయ	50	70

–సుభాష్‌నగర్

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)
- స్క్రీన్-1 కుబేర(తెలుగు)-1.30, 7.30
- స్క్రీన్-2 కుబేర(తెలుగు)-11.00, 4.20, 10.30
- స్క్రీన్-3 8 వసంతాలు -4.30, 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
- స్క్రీన్-1 ఎలియో(3డీ తెలుగు)-10.15
- ఎలియో(3డీ ఇంగ్లీష్)-4.20
- కుబేర(తెలుగు)-12.40, 6.45, 10.25
- స్క్రీన్-2 హౌ టు ట్రైన్ యువర్ డ్రాగన్ (3డీ తెలుగు)-10.05 గు)-10.05
- 8 వసంతాలు(తెలుగు)-12.50
- కుబేర(తెలుగు)-3.45
- సితారే జమీన్ పర్(హిందీ)-7.25, 10.50
- స్క్రీన్-3 కుబేర(తెలుగు)-10.00
- సితారే జమీన్ పర్(హిందీ)-1.40
- బాలేరినా(తెలుగు)-5.05
- 28 ఇయర్స్ లేటర్(ఇంగ్లీష్)-7.50
- సితారే జమీన్ పర్(తెలుగు)-10.30
- స్క్రీన్-4 సితారే జమీన్ పర్ -10.05, 4.10
- 28 ఇయర్స్ లేటర్(ఇంగ్లీష్)-1.30
- 8 వసంతాలు(తెలుగు)-7.35, 10.30

విజయ్ కుబేర | దేవి సితారే జమీన్ పర్

నటరాజ్ సితారే జమీన్ పర్ (హిందీ)

లలితామహల్ 8 వసంతాలు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

డిచ్‌పల్లి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా సంక్షేమాధికారిణి రసూల్ బీ సూచించారు. నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20 నుంచి 26 వరకు యాంటీ డ్రగ్స్ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల/కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రసూల్ బీ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం చట్టవ్యతిరేకమని తెలిపారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి చదువుపై శ్రద్ధ చూపాలన్నారు. డ్రగ్స్, గంజాయి ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను దృశ్య రూపకంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో సీడీపీవో జ్యోతి, హెడ్‌కానిస్టేబుల్ ఊషన్న, సూపర్‌వైజర్లు బుజ్జి, శోభ, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాగు చట్టాలపై అవగాహన తప్పనిసరి



నందిపేట్: రైతులు సాగు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ ఉదయ్‌భాస్కర్ అన్నారు. నందిపేట మండలంలోని సిద్ధాపూర్‌లో మంగళవారం 'లీగల్ ఎయిడ్ క్లినిక్' కార్యక్రమం నిర్వహించారు. రైతులకు సాగు చట్టాల గురించి న్యాయ సలహాల గురించి వివరించారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ ఆశా నారాయణ, మండల వ్యవసాయాధికారి జ్యోత్స్న భవాని, అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రక్తదానం ఇతరులకు ప్రాణదానం



డిచ్‌పల్లి: ఆరోగ్యంగా ఉన్న మనిషి ప్రతి ఆరు నెలలకొకసారి రక్తదానం చేయవచ్చని, మనం చేసే రక్తదానం ఇతరులకు ప్రాణదానం అవుతుందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ(ఆర్‌ఎస్‌ఈటీఐ) డిచ్‌పల్లి డైరెక్టర్ రవికుమార్ అన్నారు. ఎస్‌బీఐ 70వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్‌ఎస్‌ఈటీఐ లో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి సహకారంతో మంగళవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదానం అనేది గొప్ప సేవ అని ఎంతోమంది ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేసిన వారిమవుతామని రవికుమార్ అన్నారు. యువత ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. సంస్థలో ఫొటోగ్రఫీ అండ్ వీడియోగ్రఫీ, ఏసీ రిపేర్ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న అభ్యర్థులు 32 మందితో పాటు సంస్థ డైరెక్టర్, సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కావ్య, హాస్పిల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.